క్లుప్తంగా

త్రేతాయుగ ప్రతీక భద్రాచల పాదయాత్ర



గురుస్వామి వాసుదేవ ఆచార్యను సత్కరిస్తున్న దూసర్లపూడి రమణరాజు

బోట్‌క్లబ్‌: త్రేతాయుగంలో శ్రీరాముని 14 ఏళ్ల వనవాసంలో పాదయాత్ర చేసి ద్వాపర యుగంలో శ్రీకృష్ణునిగా భాగ్యం పొందారని గురుస్వామి వాసుదేవ ఆచార్య అన్నారు. గత 14 ఏళ్ల నుంచి భద్రచలానికి పాదయాత్ర చేస్తున్న గురుస్వామి వాసుదేవ ఆచార్యను బుధవారం స్థానిక భోగి గణపతి పీఠంలో సత్కరించారు. ద్వాపరయుగంలో పాండవుల వనవాస పాదయాత్రతో ధర్మం నిలిచిందని, కలియుగంలో ఆది జగద్గురువులు చేసిన పాద యాత్రలను అనుసరించడం వల్ల మూడు తరాలు ప్రారబ్ధ కర్మల పరిహారం కలుగుతుందన్నారు. అనంతరం భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు ఆయనను పట్టువస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిడుతూరి వీరభద్రరావు, గళ్లా సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ రూరల్‌: స్థానిక కాకినాడ డి4 సెక్షన్‌ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వార్షిక మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌ శాఖ ఈఈ ఎస్‌.ఉదయ భాస్కర్‌ తెలిపారు. 33/11 కేవీ సర్పవరం విద్యుత్‌ సబ్‌–స్టేషన్‌ పరిధిలోని 11 కెవి సెబ్రాజ్‌ ఫీడర్‌ పరిధిలోని రాజీవ్‌ గాంధీ కాలేజ్‌ ఏరియా, ఐశ్వర్య నగర్‌, భాపన్నదొర కాలనీ, ఈశ్వర్‌ నగర్‌ ఏరియా, బాలాజీ నగర్‌, ఏపీఎస్పీ ఎదురుగా, అవంతి నగర్‌, మారుతీ నగర్‌, అంజనేయ నగర్‌ ప్రాంతాలకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలరాజు

కరప: గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శివకోటి బాలరాజు మద్యం దుకాణం సమీపంలో మద్యంమత్తులో కిందపడిపోయాడు. అదే సమయంలో రామచంద్రపురం నుంచి కాకినాడవైపు వెళుతున్న లారీ వెనకచక్రం బాలరాజు ఎడమ చెయ్యి పై నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో చెయ్యి నలిగిపోయి, తీవ్రంగా గాయపడిన బాలరాజును చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులను రక్షించండి



చెరువులను రక్షించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మేడపాడు గ్రామస్తులు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో పంచాయతీ చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మోరంపూడి శ్రీరంగనాయకులు బుధవారం జిల్లా కలెక్టర్‌ షణ్మోహన్‌ సగిలికి వినతి పత్రం అందజేశారు. బుధవారం స్థానిక పంచారామ క్షేత్రానికి వచ్చిన ఆయనకు గ్రామంలో చెరువుల పరిస్థితిని వివరించారు. ఇళ్లు కూల్చగా వచ్చిన రద్దు మట్టిని పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న చెరువులలో వేసి పూడుస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల మత్స్యకారులు జీవనోపాధి కోల్పోవడంతో పాటు పంచాయతీ ఆదాయం కోల్పోతోందని మత్స్యకార సంఘ నాయకులు వేమగిరి ఏసు, దూళ్ల సత్తిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అన్ని చెరువులు పూడ్చి వేయడంతో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామంలోని చింతల చెరువు పూడ్చివేత పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం చెరువులను పూడ్చి వేసి ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చెరువులను రక్షించాలన్నారు.

వచ్చేనెల 2న ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలో మార్చి 2వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ నాయకుడు చల్లా బుజ్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ కిరణ్‌ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తారన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పంచాయతీ సమీపంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

బుజ్జాయి బంగారు భవితకు..

- అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ
- మూడు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సాలిపేటలో నిర్వహణ



పిల్లలకు ఆటలతో కూడిన బోధనా విధానాలను వివరిస్తున్న డీఆర్‌పీ రాజశేఖర్‌ తదితరులు



అంగన్వాడీ కార్యకర్తలకు తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: పసి జీవితాల్లో జ్ఞాన జ్యోతి వెలుగులు విరబూయనున్నాయి. అంగన్వాడీ కార్యకర్తలు అన్నీ తామై ఈ వెలుగుల్ని విస్తరించనున్నారు. పసి మొగ్గలకు పండంటి జీవితాన్ని అందించి వారి భవితను సమున్నతంగా తీర్చిదిద్దేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు 20 రోజుల బృహత్తర ప్రణాళిక సిద్ధమైంది. ఈ ప్రణాళికను అనుసరించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో బోధనాంశాలే భావితరాల ఉన్నతికి పునాది కానున్నాయి.

ఏమిటీ శిక్షణ?

మాతా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సర్వశిక్ష అభయాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్‌ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్‌ ఆంధ్రాస్‌ లెర్నింగ్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ (సాల్ట్‌) ప్రోగ్రాం పరిధిలో అంగన్వాడీ కార్యకర్తల కోసం నిర్దేశించిన ఈ శిక్షణ పేరు ×జ్ఞాన జ్యోతి₹. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్‌ పరిధిలో 169 మంది శిక్షణ పొందుతున్నారు. వీరు సేవలందిస్తున్న ఆయా అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న 3–5 ఏళ్ల చిన్నారులకు ఈ శిక్షణ ద్వారా లబ్ధి చేకూరనుంది. తాజా గణాంకాల ప్రకారం ఒక్క కాకినాడ అర్బన్‌ పరిధిలోనే సుమారు 3 వేల మంది చిన్నారులు ఈ ప్రయోజనాలను తమ అంగన్వాడీ టీచర్ల ద్వారా అందుకోనున్నారు.

మూడేళ్ల సర్టిఫికెట్‌ కోర్సు

ఈ శిక్షణ అంగన్వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్‌ కోర్సు. మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజులు ఈ శిక్షణ ఇస్తారు. తొలి దశలో 20 రోజులు, మలిదశలో మరో 20 రోజుల చొప్పున కొనసాగనున్న ఈ శిక్షణ 20 రోజుల వ్యవధిలో హైబ్రిడ్‌ విధానంలో నిర్వహిస్తారు. అంటే 6 రోజుల పాటు ఆఫ్‌లైన్‌ విధానంలో మిగిలిన 14 రోజుల పాటు ఆన్‌లైన్‌ విధానంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి. విద్యాశాఖ, సర్వశిక్ష అభయాన్‌, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్‌ రిసోర్స్‌ పర్సన్‌(డీఆర్‌పీ)లు శిక్షకులుగా కీ రిసోర్స్‌ పర్సన్‌ పర్యవేక్షణలో బోధనా తరగతులు నిర్వహిస్తున్నారు.

మూడు శాఖల సమన్వయంతో

మాతాశిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సర్వశిక్ష అభయాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవి, సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు అరుణ దుర్గాంబ, దయామణి, ప్రభావతి, అరుణశ్రీ, విద్యాశాఖ నుంచి రాజశేఖర్‌, ఎం.శ్రీను, యుష్మలత, ప్రసన్నకుమార్‌ డీఆర్‌పీల హోదాలో శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

ఇదీ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక అభివృద్ధి, సామాజిక–భావోద్వేగ, నైతిక అభివృద్ధి, మేధాభివృద్ధి, భాష– అక్షరాస్యత అభివృద్ధి, సౌందర్య–సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రామాణికంగా పసి భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా శిక్షణ కొనసాగుతోంది.

ఈ అంశాలపై శిక్షణ

- ఆటల ద్వారా అభ్యాసం ఈ శిక్షణ లక్ష్యాల్లో ఒకటి. ఐదు అభివృద్ధి అంశాలను ఆటల ఆధారితంగా బోధించడంపై శిక్షణ ఇస్తారు.
- పిల్లల్లో శ్రద్ధను పెంపొందించేందుకు విభిన్న సామగ్రితో పాటు పాఠ్య పుస్తకాల ఆధారిత బోధన.
- పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులను నేర్పించడం, సంరక్షించడంలో భాగస్వామ్యం.
- తల్లిదండ్రులను నిమగ్నం చేయడానికి అనుసరించాల్సిన వివిధ మార్గాలు.
- రోజువారీ తరగతుల నిర్వహణలో పరిశీలనపై ఆధారపడిన అంచనా (అసెస్మెంట్‌) ద్వారా పిల్లల అభివృద్ధిపై అంచనా ప్రక్రియ.
- సమ్మిళిత విద్యా విధానాలను అవలోకనం చేసుకోవడం, మందిలో విద్యాబోధనను సరళీకృతం చేసే విధానాలు
- పిల్లల ఆరోగ్యం, సంరక్షణ ప్రాధాన్యాలపై శిక్షణ

బాల్యానికి మేలు మలుపు



అంగన్వాడీ కార్యకర్తలకు అందిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ బాల్యానికి ఓ మేలు మలుపు. బాలల భవితను తీర్చిదిద్దేందుకు ఇది ఒక ప్రత్యేక కార్యక్రమం. 3–5 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలే ఈ కార్యక్రమ లక్ష్యం. కలెక్టర్‌ పర్యవేక్షణలో ఐసీడీఎస్‌ పీడీ విజయకుమారి సహా సంయుక్త శాఖల అధికారుల సమన్వయంతో ఈ శిక్షణ జరుగుతోంది. ఈ నెల 25వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తాం. ఎర్లీ చైల్డ్‌ కేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌ (ఈసీసీఈ), ఫౌండేషన్‌ లిటరసీ అండ్‌ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్‌)ల అమలు, కార్యాచరణ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జ్ఞానజ్యోతి దోహదపడనుంది. 0–3 ఏళ్ల లోపు పిల్లల సంరక్షణతో పాటు తల్లిదండ్రులను పిల్లల సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం, అందుకు అంగన్వాడీ కార్యకర్తల రూపంలో మాధ్యమాలను సిద్ధం చేయడమే లక్ష్యం.

అనసూరి జ్యోతి, సీడీపీవో, కాకినాడ అర్బన్‌ ప్రాజెక్టు

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న 1962 వాహనాల ఉద్యోగులు

కాకినాడ సిటీ: పశు సంవర్ధకశాఖలో పశు సంచార వాహనాలపై పని చేసే సిబ్బందిని తొలగిస్తున్నట్లు ఆదేశాలు ఇవ్వడం దారుణమని, తక్షణమే ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, కోశాధికారి మలక వెంకట రమణ ప్రభుత్వాన్ని కోరారు. పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1962 వాహనాల నిలిపివేతపై కలెక్టరేట్‌ వద్ద బుధవారం ఈ మేరకు ధర్నా చేశారు. జిల్లాలో పశు సంచార వాహనాలు 14 ఉన్నాయని, వాటిలో డ్రైవర్లు, ఫార్మసిస్టులు, డాక్టర్లు పని చేస్తున్నారన్నారు. వీరందరిని తొలగిస్తున్నట్లు వారికి వాట్సాప్‌లో మెసేజీలు పంపారని, వాటిని వెంటనే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. వాహనాల సిబ్బందికి బకాయి పడిన రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం జేసీ రాహుల్‌ మీనాకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లింపునకు తక్షణమే ప్రభుత్వంతో మాట్లాడతామని, వీరిని విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ మల్లిక, శ్రీను, రమణ, ప్రసాద్‌, సుమన్‌, దుర్గాప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తిచేయాలి



మండల కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కరప: ఇంటింట సర్వే సకాలంలో పూర్తిచేయాలని మండల ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్‌ సమావేశ మందిరంలో బుధవారం మండల కార్యదర్శుల సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించి, అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలు ఇచ్చారు. డ్రోన్ల ఆధారంగా నిర్వహించిన సర్వే మ్యాప్‌ ఆధారంగా ఆయా ఇంటి యజమానులకు సరిహద్దులను నిర్ణయించి, ఏమైనా అభ్యంతరాలుంటే తీసుకుని, సర్వే పూర్తి చేసి, ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు ముమ్మరం చేసి, నూరుశాతం వసూళ్లు పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వేసవిలో అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఈఓ పీఆర్డీ సూచించారు.

ఆట, పాటలతో చదువుపై ఆసక్తి కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ బుల్లి కృష్ణవేణి

కరప: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట, పాటలతో విద్యా బుద్ధులు నేర్పడం ద్వారా చదువుపై ఆసక్తి కల్పించాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ అన్నారు. వేళంగిలోని మెర్లాస్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్‌ శిక్షణను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణలో అన్ని విషయాలను వివరించి అవగాహన కల్పించాలన్నారు. రిసోర్స్‌ పర్సన్లు వై.శ్రీనివాస్‌, ఎస్‌.విష్ణు అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. జిల్లా సమగ్ర శిక్ష పరిశీలకుడు ఏఎల్‌ఎస్‌సీ కో ఆర్డినేటర్‌ హరికృష్ణ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లను, శిక్షణను పరిశీలించి సూచనలిచ్చారు. సీడీపీఓ వై.లక్ష్మి, సూపర్‌వైజర్లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణ, సీఆర్పీ పి.సత్యనారాయణ, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణుని ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఈవో లక్ష్మీనారాయణ

కాకినాడ రూరల్‌: స్థానిక సర్పవరం భావనారాయణ స్వామి దేవస్థానం ప్రహరీ గోడను పునర్నిర్మించనున్నట్టు ఆలయ ఈవో లక్ష్మీ నారాయణ బుధవారం విలేకర్లకు తెలిపారు. ఏడేళ్ల క్రితం అధిక వర్షాల వల్ల పురాతనమైన ఈ గోడ కూలి పోయింది. అప్పటి నుంచి పురావస్తు శాఖ పలు మార్లు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నేటి వరకు ఎటువంటి పురోగతి కనిపించలేదు. దేవస్థానం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భక్తులు, గ్రామస్తుల మనోభావాలకు అనుగుణంగా దేవస్థానం నిధులతో ఈ గోడను పునర్నిర్మించేందుకు పురావస్తు శాఖకు నివేదికలు పంపగా గోడల మధ్యలో కాంక్రీట్‌ రాయి వేసి కరక్కాయ, గానుగ సున్నంతో దీనిని నిర్మించేందుక వారు అనుమతించారు. దేవస్థానం నిధులతో ఈ చర్యలు చేపడుతున్నారు. బుధవారం దేవస్థానం సిబ్బంది, అర్చకులు గ్రామస్తులు, భక్తులు, పురావస్తు శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌, వారి సిబ్బంది సమక్షంలో దేవస్థానం నిధులతో ఈ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు చెప్పారు.

ఘనంగా ముసాలమ్మ తీర్థం



ముసాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్‌ కోఆర్డినేటర్‌ కన్నబాబు

కరప: మండలంలోని వేములవాడ గ్రామ దేవత ముసాలమ్మ తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి శివారున రాయిచెట్టు వద్ద ఉండే ముసాలమ్మను మూడునెలల ముందుగా గ్రామంలోనికి తీసుకు వచ్చి తాటాకుల పాక (అంగణిగుడి) వేసి నిలుపుతారు. మూడు రోజుల పాటు గ్రామోత్సవం జరిపి, అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తూ చివరి రోజున ముసాలమ్మకు మొక్కులు తీర్చుకుని తీర్థం నిర్వహిస్తారు. ఆ రోజున అమ్మవారిని రాయిచెట్టువద్ద అమ్మవారి గుడికి తీసుకెళతారు. ఈ యేడాది గ్రామస్తులు బంధువులను, స్నేహితులను, ఇంటి ఆడపడచులను, అల్లుళ్లను పిలుచుకుని అమ్మవారి తీర్థాన్ని ఘనంగా జరుపుకున్నారు. కరప డీసీ చైర్మన్‌ పుణ్యమంతుల సత్యనారాయణ (పీజీ), ఆలయ కమిటీ సభ్యులు జాతర, తీర్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్‌ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్‌ కోఆర్డినేటర్‌, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సర్పంచ్‌ కమిడి మంగాదేవి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీ అనసూరి శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు, వేములవాడ గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వలసపాకలలో

మండలం వలసపాకల గ్రామదేవత ముసాలమ్మ తీర్థం సైతం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందురోజు రాత్రి అమ్మవారికి జాతర నిర్వహించారు. తీర్థంరోజున గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్‌ వాసంశెట్టి రామారావు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ



ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్‌: ఛత్రపతి శివాజీ భారతీయులందరికీ ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్న తనంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి తన ప్రయాణాన్ని ప్రారంభించారన్నారు. అతని ధైర్యం, శక్తి యుక్తులు ప్రత్యర్థులను అధిగమించి, ముఖ్యమైన భూభాగాలపై తన ఆధిపత్యాన్ని ప్రకటించారన్నారు. అతని సైనిక వ్యూహాలు, వినూత్న వ్యూహాలు యుద్ధాల్లో ఆధిక్యాన్ని అందించాయన్నారు. శ్రీశైల దేవాలయమును ఎన్నోసార్లు దండయాత్రలు నుంచి కాపాడి శ్రీశైలం భ్రమరాంబిక అమ్మవారి స్వహస్తాలతో వీర ఖడ్గం అందుకున్న ఘనుడన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్‌, మొసలగంటి సురేష్‌, గౌతు చిన్న పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్‌: చేస్తున్న పనిపై అంకితభావం, మచ్చ లేని వ్యక్తిత్వంతో ఛత్రపతి శివాజీ అందరికీ ఆదర్శంగా నిలిచారని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్‌, రాజా తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాల యజమానులు జాగ్రత్తలు పాటించాలి

పిఠాపురం: పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో కోళ్ల మరణాలకు సంబంధించి ఇంకా వ్యాధి నిర్ధారణ కాలేదని, ఈ లోపు విధించిన ఆంక్షలు అమలులోకి తీసుకురావాలని కలెక్టర్‌ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో కోళ్ల మృతిపై వాస్తవాలు నిర్ధారించడానికి పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి నమూనాలు సేకరించారన్నారు. ఘటన ప్రదేశంలో తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొలంలో ఇతర జంతువులు, పక్షులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది ఇతర వ్యక్తులు ఆయా ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానిత పొలాల్లో పని చేసే వారు మరే ఇతర పౌల్ట్రీ ఫారం, పక్షుల అభయారణ్యం, జూ తదితర వాటిలోకి వెళ్ల కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో ప్రవేశ ద్వారాల వద్ద కచ్చితంగా క్రిమి సంహారక చర్యలు తీసుకోవాలన్నారు.

పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

సామర్లకోట: పదో పరీక్షలను పండగ వాతావరణంలో రాసేలా విద్యార్థులు సిద్ధపడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్‌ మున్సిపల్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన సందర్శించారు. ఇటీవల పూర్తి చేసుకున్న ప్రీ ఫైనల్‌ పరీక్షల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచి సెల్‌ ఫోన్‌, టీవీలు, ఆటలకు దూరంగా ఉండి పుస్తకాలపై శ్రద్ధ చూపాలని పిలుపు నిచ్చారు, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ ప్రీ ఫైనల్‌ పరీక్షలతో విద్యార్థులకు ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. ఈ పరీక్షలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధ చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పదో తరగతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి



జేసీ రాహుల్‌ మీనాకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఎనిమిది నెలలైందని, తక్షణం ఆ మేరకు నోటిఫికేషన్‌ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు సీహెచ్‌ గీత, వై.బాబి బుధవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌ మీనాకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం, ఆ విషయమే మరిచిపోయినట్లు ఉన్నారని విమర్శించారు. నోటిఫికేషన్‌ లేక లక్షలాది మంది నిరుద్యోగులు రూ.లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్‌ తీసుకుని నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు అండగా కలెక్టర్లకు, ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పలు జిల్లాలో పోస్టుల ఎంపికపై అన్యాయం జరుగుతోందని, అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జిల్లాల మాదిరిగా పోస్టులు పంచాలని వినతి పత్రంలో కోరినట్లు బాబీ, గీత తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ నాయకులు వి.లోవ, ఎం.వీరబాబు, మైఖేల్‌ తదితరులు పాల్గొన్నారు.

రహదారి గతుకుల పూడ్చివేత



సాక్షిలో ప్రచురితమైన కథనం



సాక్షిలో ప్రచురితమైన కథనంతో బుధవారం గతుకులు పూడ్చివేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్‌

కాకినాడ రూరల్‌: పిఠాపురం – కాకినాడ మార్గంలో రాయుడు పాలెం జంక్షన్‌, ఏపీఐఐసీ వద్ద కనక దుర్గమ్మ గుడి ఎదురుగా రహదారిపై ఏర్పడిన గతుకులను ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం పూడ్చారు. ఈ నెల 6న సాక్షిలో 'ఆదమరిస్తే.. అంతే'! శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ముఖ్యంగా ఏపీఐఐసీ కాలనీ వద్ద కనకదుర్గమ్మ గుడి ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన గతుకులుతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యేవారు. గతుకుల పూడ్చివేతతో సమస్య తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోడి పందేలపై దాడి

- నలుగురి అరెస్టు
- రెండు కోళ్లు, రూ.9 వేల స్వాధీనం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలిలో కోడి పందేల శిబిరంపై బుధవారం దాడి చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు కొడవలి శివారు ప్రాంతంలో కోడి పందాలు ఆడుతున్న శిబిరం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9050, 2 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌.రామకృష్ణ తెలిపారు.